ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మార్కా'పుర'ంలో..

అడ్డగోలు బదిలీలు..!

• నేడు ఇక్కడ... రేపు ఎక్కడో..?
• సిబ్బందిలో అయోమయం..!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ సిబ్బంది బదిలీలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. ఈ బదిలీలు తాత్కాలికమే అయినా.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఈ బదిలీలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ రోజు ఒక సచివాలయానికి బదిలీ చేయగా.. రెండు రోజుల తరువాత మరో సచివాలయానికి బదిలీ ఉత్తర్వులు అందడంతో సిబ్బంది అయోమయంలో పడుతున్నారు.

ఇలా ఎందుకు జరుగుతోందని సచివాలయ సిబ్బందిలో చర్చ జరుగుతోంది. గడచిన ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించలేదనే అనుమానంతో కొందరు టిడిపి నేతలు కక్షగట్టి ఈ బదిలీలకు అధికారుల ద్వారా పూనుకున్నారని తెలిసింది. ఈ రకంగా అడ్డగోలు బదిలీలతో విధులు సక్రమంగా నిర్వహించలేకున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ చేసిన సచివాలయంలో ఉంచుతారా.? అంటే అదీ లేదు. అక్కడి అధికార పార్టీ నేతలకు నచ్చకపోతే మరోచోటకు బదిలీ కావాల్సిందే. ఈ పద్ధతి గతంలో ఎన్నడూ లేదని సచివాలయ సిబ్బంది అసహనానికి గురవుతున్నారు.

వార్డు సచివాలయం-2లో వార్డు ప్లానింగ్ మరియు రెగ్యులేషన్ సెక్రటరీగా

పనిచేస్తున్న గుర్రం విష్ణువర్ధన్ 10వ సచివాలయానికి ఇన్‌చార్జిగా నియమిస్తూ ఈ నెల 23న మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే రోజు 5వ వార్డు సచివాయంలో పనిచేస్తున్న శ్రీరాంసాయిని 19వ సచివాలయానికి, 8వ సచివాయంలోని అన్నవరపు మనోజ్ కుమార్‌ను 5వ సచివాలయానికి బదిలీ చేశారు. 10వ సచివాలయంలోని ఆర్.ఆది నారాయణ 20వ సచివాలయానిక బదిలీ కావడం జరిగింది. 15వ వార్డు సచివాలయ ఉద్యోగి వై.హేమంత్‌ను 12వ సచివాలయానికి బదిలీ చేశారు. 16వ సచివాలయంలోని కె.స్పందన ▶ 2లో

గ్రామాల్లో కొత్త అలజడి

• రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలను తప్పించే వ్యూహం
• అధికారం మారాక అంతా మావాళ్లు ఉండాల్సిందేనంటున్న టిడిపి
• వైసిపి ముద్ర వేసి.. ఇక వెళ్లిపోవాల్సిందేనంటూ హుకుం జారీ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అధికారం ఏ పార్టీకి దక్కినా రాజకీయ నేతలకు మాత్రం ఎటువంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే అధికారపార్టీలోకి దూకేస్తారు. కొద్దిమంది మాత్రమే రాజకీయ విలువలతో ఉంటే వాళ్లే నిలబడుతున్నారు. ఇప్పుడూ ఇదే జరుగుతోంది. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ఇప్పటికే క్యూ కట్టారు. వాళ్లకేమీ ఇబ్బంది లేదు. అయితే గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే చిన్నచిన్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం బలైపోతున్నారు. వారికి అప్పటివరకూ ఉన్న పార్టీ ముద్ర వేస్తారు. అధికారం రాగానే మీరు తప్పుకోవాలని పాలకపక్ష నేతలు బెదిరించి తప్పిస్తుంటారు. ఇప్పుడు గ్రామాల్లో ఇవే జరుగుతున్నాయి.

చిన్న ఆదాయాలపై బతికే వేలాది మందికి ఇప్పుడు గండం వచ్చింది. రేషన్ డీలర్లు, ఉపాధి హామీ చట్టం అమలులో కీలకపాత్ర పోషించే ఫీల్డ్‌అసిస్టెంట్లు, డ్వాక్రా మహిళలకు చేదోడువాదోడుగా ఉంటే విఒఎలను, మధ్యాహ్న భోజనం కార్మికులు.. ఇంకా అనేక పథకాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే వారందరినీ తప్పిస్తున్నారు. ఇప్పటికే అందరికీ చెప్పేశారు. గ్రామాల్లో పాలకపక్షంలో ఉండే కీలక నేతలు ఈ తరహా ఆదేశాలు జారీ చేశారు. తాము చాలా కాలంగా పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నామని చెప్పినా వినడం లేదు. అనేక మంది ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వినిపించుకుంటున్నారు. ఇప్పుడు గ్రామాల్లోనూ, ఎమ్మెల్యేల కార్యాలయాల వద్ద నిత్యం వీటిపైనే చర్చ సాగుతోంది. రేషన్ దుకాణాలను మొత్తంగా లాగేసుకొని తెలుగుదేశం నేతలకు అప్పగించే వ్యూహం నడుస్తోంది. ఇప్పటికే రేషన్‌డీలర్ల జాబితా తయారవుతోంది. ఎవరిని ఎక్కడ పెట్టాలనే దానిపై ఎమ్మెల్యేలే నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలోనూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పుడు రేషన్ డీలర్లను అందరినీ మార్చే శారు. ఇప్పుడూ ఇదే జరుగు తోంది. ఇవి పూర్తిగా రాజకీయం గా కీలకమైన నిర్ణయాలుగా మారాయి. రేషన్‌డీలర్ పోస్టు అంటే భావి ఆదాయవనరుగానే భావిస్తున్నారు. పార్టీ కోసం బాగా పని చేసిన వారికి దీన్ని అప్పగిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను దాదాపుగా పీకేస్తున్నారు. వీరికి కొంత వేతనంతో పాటు మస్టర్లలో మతలబులతో కొంత సంపాదించుకుంటున్నారు. వీరంతా వాస్తవానికి పేదలే.. ఏదేమైనా ఇప్పుడు ఉన్నవారిని తప్పించి తెలుగుదేశం వారిని పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విఒఎలను దాదాపుగా తప్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇవన్నీ కొంటాక్ట్ పద్ధతిలోనూ, నామినేట్ చేసుకోవడం వంటి ప్రక్రియల్లోనే కొనసాగుతారు. వీరందరినీ ఎత్తేసేందుకు సన్నాహాలు నడుస్తున్నాయి. ఇంకా తాగునీటి పథకాల నిర్వహణ, కరెంటు మీటర్ల రీడింగు కాంట్రాక్టులు, నీటి సరఫరా విభాగాల్లో పనిచేసే వర్కర్లు, పంచాయతీల్లోనూ, మండలాల్లో తాత్కాలికంగా పనిచేసే వారిని కూడా తప్పించాలనే ఆలోచనలో ఉన్నారు. ఏదేమైనా ఈ తరహా మార్పులు ఇప్పుడు గ్రామాల్లో కొత్త అలజడిని కలిగిస్తున్నాయి. అధికారం మారిందని గ్రామాల్లోనూ అందుకు తగ్గట్టుగా మార్పులు చేసుకునే దిశగా పాలకపక్ష నేతలు పావులు కదుపుతున్నారు.

వ్యవసాయ రంగ ద్రోహి మోడీ

• బడ్జెట్ కేటాయింపులలో రైతాంగానికి తీరని ద్రోహం
• సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు
• కలెక్టరేట్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్రబడ్జెట్‌లో వ్యవసాయం, రైతాంగానికి, వ్యవసాయ కార్మికులు, కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ రంగారావు ధ్వజమెత్తారు. ఒంగోలు కలెక్టర్ ఎదుట సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి కార్మిక సంఘాల నాయకులు పివిఆర్ చౌదరి, జివి కొండారెడ్డి, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, భీమవరపు సుబ్బారావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో చుండూరి రంగారావు మాట్లాడుతూ 2024-25 కేంద్ర బడ్జెట్లో 9 అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొందని, తొమ్మిదిలో వ్యవసాయరంగం మొదటిదన్నారు. అందుకు అనుగుణంగా కేటాయింపులు మాత్రం జరగలేదన్నారు. వ్యవసాయానికి రెట్టింపు ఆదాయం అన్న మోడీ హామీకి తూట్లు పొడిచేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించవలసి ఉంటుందన్నారు. గత నెలలో మద్దతు ధర ప్రకటించిన పంటలు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ధరల కన్నా 28 నుండి 35 శాతం వరకు తక్కువగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగానికి ఎలా పెద్దపీట వేశారో మోడీ చెప్పాలని నిలదీశారు. మోడీ ప్రభుత్వం సబ్సిడీల కోత ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఎరువులకు 2022- 23 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీ రెండు లక్షల 51 వేల 340 కోట్లు కేటాయిస్తే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. ఒక లక్ష 95 వేల 421 కోట్లు కేటా యించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష 64 వేల 561 కోట్లు కేటాయించారన్నారు. ఎరు వుల సబ్సిడీకి కేటాయించిన ▶ 2లో

'శ్రీకరి' విల్లాస్‌లో

అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక వెంగముక్కపాలెం సమీపంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి నిర్మిస్తున్న శ్రీకరి ఎంపోరియమ్ విల్లాస్‌లో మైనింగ్, రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విల్లాస్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ గత కొంతకాలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిడిపి నాయకులు ఇటీవల అధికారులను కలిసి ఫిర్యాదులు కూడా చేశారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ప్రభుత్వ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఒంగోలు తహశీల్దార్ సుజన్‌కుమార్, మైనింగ్ ,సెబ్ అధికారులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. తనిఖీల సమయంలో మీడియాను లోపలకు అనుమతించలేదు. అయితే తనిఖీచేసిన అధికారులు లోపల ఏం పరిశీలన చేశారనే విషయం మాత్రం బయటకు చెప్పలేదు. సెబ్ అధికారులను ప్రశ్నించగా తాము ఇసుకకు సంబంధించి మాత్రమే పరిశీలన చేశామని పేర్కొన్నారు. తనిఖీల సమయంలో అధికారులకు రక్షణగా తాలూకా పోలీసులు అక్కడ బందోబస్తు నిర్వహించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు నిర్మిస్తున్న విల్లాస్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారన్న వార్త సోమవారం నగరంలో దావానలంలా వ్యాపించింది. ఈ పరిణామం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశం అయ్యింది.

మార్కా'పుర'ంలో అడ్డగోలు బదిలీలు.!

(మొదటిపేజీ తరువాయి)

సెలవులో ఉన్నందున ఆమె స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను జెరంగస్వామిని బదిలీ చేశారు. 19వ సచివాలయంలోని వెన్నా వివకానందరెడ్డిని 17వ సచివాలయానికి బదిలీ చేశారు. 20వ సచివాలయంలోని ఆర్.హేమలతను 15వ సచివాలయానికి బదిలీపై పంపారు. ఇంతవరకు బాగానే ఉంది. బదిలీ చేసిన చోట పని చేయాలని వారంతా విధుల్లో చేరారు. ఇంతలో అక్కడి అధికార పార్టీ నేతలకు గిట్టలేదు. 'మీకు పనికి రాని వారు మాకు పనికి వస్తారా..' అంటూ కమిషనర్‌పై ఒత్తిడి చేయగా... మరలా ఇంకో ప్రాంతానికి వారానికి బదిలీ చేయక తప్పలేదు. ఈ నెల 26న మరోసారి బదిలీ ఉత్తర్వులు అందుకోక తప్పలేదు. మరోసారి.. మరొక ప్రాంతానికి బదిలీ అయిన వారిలో ఎ.మనోజ్‌కుమార్, జె.రంగస్వామి, ఆర్.హేమలత, వెన్నా వివేకానందరెడ్డిలు ఉన్నారు. ఇలాంటి బదిలీలు ఎక్కడా చూడలేదని, ఎక్కడ ఎన్ని రోజులు పనిచేస్తామో కూడా తెలియకుండా ఉన్నామని కొందరు సచివాలయ ఉద్యోగులు లోలోన మదనపడుతున్నారు.

వ్యవసాయ రంగ ద్రోహి 'మోడీ'

(మొదటిపేజీ తరువాయి)

నిధులు రూ. 90 వేల కోట్లకు పైగా కోత పెట్టారని, ఆహార సబ్సిడీలో రూ. 61 వేల కోట్లు కోత విధించారన్నారు. రైతన్నల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివిఆర్ చౌదరి, జివి కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44హక్కులను, చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. కార్మికులు కనీసం సంఘాన్ని పెట్టుకునే హక్కును కోల్పోయారని, పని గంటల విధానానికి మంగళం పాడే పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసి వారి శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ ప్రాంత పేదలకు జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం దిశగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.లక్ష 25కోట్లు మాత్రమే కేటాయించారని, గతంతో పోల్చుకుంటే ఉపాధి హామీ పథకానికి రూ. 86 వేల కోట్లు కోత విధించారన్నారు. ఇది పేదల కడుపు కొట్టడమేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, భీమవరపు సుబ్బారావు ప్రసంగించారు. అనంతరం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, జి.రమేష్, ఎం.అయ్యపరెడ్డి, పల్లా హనుమంతరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు ఉప్పుటూరు ప్రకాష్‌రావు, వేజెండ్ల శివరాం, ఆవుల సుబ్రహ్మణ్యం, పిఒడబ్ల్యు పద్మ, పి సుబ్బారావు, పాటిబండ్ల సిద్దయ్య, కాట్రగడ్డ వెంకటకృష్ణ, మండవ శ్రీనివాసరావు, సుల్తాన్ బాషా, సిరి నారాయణ, సిరిమామిళ్ల ఆదినారాయణ, పి రామారావు పాల్గొన్నారు.

ఉచితంగా పశుగ్రాసం విత్తనాలు..

ప్రజాశక్తి-ఇంకొల్లు

స్థానిక పశు వైద్యశాల ఏడి పరిధిలోని మండలంలోని గ్రామాలకు సంబంధించిన పశుపోషకులకు, ఉచిత పశు గ్రాసం విత్తనాలను అందిస్తున్నట్లు ఏడి వెంగళరావు తెలిపారు. జాతీయ పశుగ్రాసాభివృద్ధి పథకం ద్వారా రైతులకు ఉచితంగా ఒక్కొక్కరికి మూడు కేజీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం సంగం డెయిరీ ద్వారా సేకరించిన హైబ్రిడ్ గ్రాసం విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రకం ఎక్కువ గ్రాసం దిగుబడి వస్తుందని, గ్రాసంలో పోషకాలు అధికంగా ఉండుటవలన పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాల దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో పాటు ఫోన్ నెంబర్ నమోదు చేయించుకొని విత్తనాలు తీసుకుపోవాలని సూచించారు.

రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా
- స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేత

స్టేషన్ మాస్టర్ కు అర్జీ అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-చీరాల

రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు ఏపీ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా వారికి కనీస వేతనాలు ఇవ్వాలని కాంట్రాక్టర్ మారినప్పుడల్లా కార్మికులను తొలగించరాదని విశ్రాంతి గదులు మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న చట్ట ప్రకారం కనీస వేతనాలు ఉద్యోగ భద్రత సెలవులు బోనస్ తదితర చట్టబద్ధమైన హక్కులన్నీ నిరాకరించబడుతు అటు కాంట్రాక్టర్ల దోపిడీకి ఇటు రైల్వే యాజమాన్యం నిర్లక్ష్యానికి గురవుతున్నారు. అనంతరం కార్మికుల సమస్యల పై స్టేషన్ మాస్టర్ కి మెమోరాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి నారపరెడ్డి దేవరకొండ లక్ష్మి దేవరకొండ భవాని గంగ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కమిషనర్ చక్రవర్తి

ప్రజాశక్తి-చీరాల

వర్షాకాలము దష్ట్యా అంటువ్యాధులు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశము ఉన్నందున పారిశుధ్యము, పరిశుభ్రత పై ప్రత్యేక దష్టి పెట్టాలని కమీషనరు కె. చక్రవర్తి అన్నారు. సోమవారం నల్లగాంధీ బొమ్మ నుండి కుందేరు వరకు, చిన్న రథము సెంటరు నుండి ఓడరేవు రోడ్డు, కోర్టు రోడ్డు, కుందేరు వరకు పారిశుధ్య సిబ్బంది ద్వారా జరుగుచున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. సదరు ప్రాంతాల యందు గల డ్రైనేజిల యందు నిల్వయున్న సిల్టును, చెత్తను వర్కర్ల ద్వారా శుభ్రము చేయించుట జరిగినది. అనంతరము రోడ్లపై నిలిచియున్న వర్షపు నీటిని పారిశుధ్య వర్కర్ల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రపరచవలసినదిగా చేయుటకు పారిశుధ్య సిబ్బందికి సూచనలు జారీ చేసియున్నారు. వర్షపు, మురుగు నీరు నిల్వయున్న ప్రాంతాలలో బ్లీచింగు, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టవలసినదిగా, దోమల నివారణకై ఫాగింగు చేయించవలసినదిగా పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అనంతరం శానిటరీ ఇన్స్ పెక్టరు, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య మేస్త్రులు మరియు సిబ్బంది హాజరును పరిశీలించారు. అదే విధంగా నీటి కుళాయి కనెక్షన్లకు సంబంధించి నీటిని ఇంటి యజమానులు వధా చేయుచున్నారని పరిశీలించినందున సదరు యజమానులకు నోటీసులు జారీ చేయవలసినదిగా వార్డు ఎమినిటి సెక్రటరీలకు ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి..

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లాసీనియర్ సిటిజన్స్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు గుడూరివీర బ్రహ్మం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ జిల్లా పట్టణ కార్యాలయాలకు బాపట్ల పట్టణంలో జమ్ములపాలెం ఫ్లైఓవర్ క్రింద ఒక కానాను సంఘం కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కేటాయించాలని కోరినట్లు తెలిపారు . దీనిపై జిల్లా కలెక్టరు సానుకూలంగా స్పందించారన్నారు . వినతి పత్రం అందజేసిన వారు సీనియర్ సిటిజన్స్ పట్టణ అధ్యక్షులు కాగిత శ్రీహరి రావు, బొలగాని వెంకటేశ్వర్లు, పీ సి సాయిబాబు, దేవవరం, మామిడాల రామాంజనేయులు, కామరాజు కాళిదాసు, ఎస్ ఎస్ గుప్తా ఉన్నారు.

సాహిత్య పరిమళాలు వెదజల్లిన 'సినారె'

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు సాహిత్య పరిమళాల సౌరభాల గుబాలింపుతో సాహిత్యాన్ని పరుగులు పెట్టించిన విశ్వంభరుడు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి నారాయణరెడ్డి సాహితీ చరిత్రలో సుస్థిర స్థానం సొంతం చేసుకున్నారని ప్రజాకవి వైద్య విద్వాన్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సి నారాయణరెడ్డి 93వ జయంతిని బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో జమేదార్ పేటలో నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ రెడ్డి రచించిన విశ్వంభర కావ్యానికి 1988లో జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారన్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, కళా ప్రపూర్ణ వంటి సత్కారాలను అందుకున్నారన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ నారాయణరెడ్డి 1997లో రాజ్యసభ సభ్యునిగా ఆదర్శవంతంగా పదవీ బాధ్యతలు నిర్వహించారన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ నారాయణ రెడ్డి చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన, శివరంజని నవరాగిణి మల్లియలారా మాలికలారా, అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం.. వంటి నవరసభరిత పాటలు రచించి తెలుగు సినిమా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పచుకొన్నారని ప్రశంసించారు. సభలో మర్రి మాల్యాద్రి రావు, కస్తూరి శ్రీనివాసరావు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి,పువ్వాడ వెంకటేశ్వర్లు, మస్తాన్ రెడ్డి, కీర్తి వెంకయ్య పాల్గొన్నారు.

గ్రామస్తుల చొరవతో బావి శుభ్రం

ప్రజాశక్తి-నిజాంపట్నం

అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లో వెళితే.. మండల కేంద్రమైన నిజాంపట్నం పంచాయతీ పరిధిలోని థామస్ పేటలో ఉన్న మంచి నీటి బావిలో నిత్యం సమీప చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు త్రాగు నీరుని తీసుకువెళ్తుంటారు. ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాగు నీరుని తీసుకువెళ్లేందుకు ఆ ఒక్క బావియే దిక్కు. అయితే ఈ మధ్యకాలంలో ఆ బావిలోని నీరు కొద్దిగా రంగు మారడంతో ఆ నీరు తాగడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తాగునీటి సమస్య ఏర్పడినందున ఆ గ్రామ యువకులు, కొంత మంది పెద్దలు కలిసి నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శికి బావిలోని రంగు మారిన నీటిని బయటకు లాగేందుకు మోటార్ ఇవ్వాలని కోరగా రెండు, మూడు రోజుల వరకు మోటార్ ఇవ్వడం కుదరదని అయన చెప్పారన్నారు. దీంతో అప్పటివరకు తాగునీటికి ఇబ్బంది కలుగుతుందని భావించిన గ్రామస్తులు చొరవ తీసుకుని తమ సొంత ఖర్చుతో మోటార్‌ను తెచ్చుకొని బావిలోని రంగు మారిన నీరుని బయటకి లాగించి బావిని శుభ్రం చేసుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడే ఇలాంటి సమస్యలను కూడా అధికారులు పట్టించుకోకపోతే ఎలా అని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీపై అవగాహన

ప్రజాశక్తి-చీరాల

స్థానిక చీరాల ఇంగినీరింగ్ కళాశాలలో బ్లాక్ చైన్ టెక్నాలజీ మీద విద్యార్థులకు అవగాహన సెమినార్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డా.జగదీష్ తెలియచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వ్యవస్థాపకులు అవినాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇమ్యుటబుల్, డిస్ట్రిబ్యూటెడ్, డీసెంట్రలైజెడ్, నెట్వర్క్ గురించి వివరించారు. సెక్యూర్ టెక్నాలజీ పై దాని ఆవశ్యకతను వివరించారు. రియల్ ఎస్టేట్, ఆర్థిక రంగాలలో బ్లాక్ చైన్ టెక్నాలజీ ప్రాముఖ్యత మరింత పెరగనున్నదని వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఈ రంగాన్ని ఎంచుకొని ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచుకోవాలని తెలియచేసారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు శ్రీ మార్కండేయ పద్మశాయ బహుత్తమ సేవా సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బట్టు మల్లికార్జునరావు, మురుగుడు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి కొత్తపేటలోని మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో జరిగిన కార్యవర్గ ఎంపికలో అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోగా సోమవారం అధ్యక్షులు మల్లికార్జునరావు నివాస గృహంలో నూతన సంఘ సమావేశం ఏర్పాటు చేసి మరో 21 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కే శివ నాగేశ్వరరావు, కోశాధికారిగా తిరువీధుల బాలాజీ, సహాయ కార్యదర్శిగా అందే శివప్రసాద్, కొతరపు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా కొతరపు పిచ్చయ్య శాస్త్రి, మరో 16 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మల్లికార్జునరావు మాట్లాడుతూ గత పాలకవర్గం అప్పగించిన 16 లక్షల 4 వేల 830 రూపాయలను కోపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘీయులు, పెద్దలు ఉన్నారు.

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS NO : 4/2022
కుందూరు సుప్రజ ... వాది
వర్సెస్
రావూరి రాఘవరెడ్డి వగైరాలు ... ప్రతివాదులు
To
రావూరి రాఘవరెడ్డి,తండ్రి శ్రీనివాసరెడ్డి,
నివాసం : పేర్నమిట్ట గ్రామం, సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబర్ దావాలో నీకు నోటీసు నిమిత్తం తేదీ 12-08-2024నా వాయిదా అయివున్నది. పై తేదీన హైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
అడుసుమల్లి రామయ్య
వాది తరపు అడ్వకేట్, ఒంగోలు
సెల్ : 9440390288,

మహారాజశ్రీ 3 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులోఒంగోలు
OS NO : 608/2023
మోదేపల్లి శ్రీనివాసులు ..... వాది
వర్సెస్
తెలికేపల్లి ఉమాశంకర్ .... ప్రతి వాది
To
తెలికేపల్లి ఉమాశంకర్, తండ్రి శ్రీనివాసమూర్తి,
డోర్ నెంబర్ : 8-441, సుందర్ నగర్,
మంగమూరుడొంక, ఒంగోలు.
పై నెంబర్ గల దావా లోమీ హాజరు నిమిత్తం అనేక పర్యాయములుకోర్టు ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయ చున్నందున శ్రీ కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం పేపరు ప్రకటన కు ఉత్తర్వులు జారీచేసినారు కావున వాయిదా తేది : 09-08-2024న ఉదయం గం 10.30 నిమి.పై కోర్టు వారి ఎదుట మీరు స్వయం గా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
ఆళ్ళ హరిబాబు
ఆళ్ళ రవిచంద్ర
వాది తరపు న్యాయవాదులు, ఒంగోలు
సెల్ నెంబర్ : 8886237590

ప్రజాశక్తి
మంగళవారం 30 జూలై 2024

కార్మికుల తొలగింపు అన్యాయం

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు అన్యాయమని, వెంటనే ఈ చర్యలు మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అధికారులను కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి ఇప్పటికిప్పుడు అధికార పార్టీకి తొత్తులుగా ఉండే వారిని నియమించుకుంటున్నారని రఫి ఆరోపించారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు ఆధ్వర్యంలో) సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడారు. తొలగింపులు నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొందరిపై ఒత్తిడి పెంచి బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని ఆరోపించారు. గత 23 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను సైతం అకారణంగా రాజీనామాలు చేయమని బలవంతం చేయడం, ఆపై బెదిరించడం సరికాదన్నారు. గతంలో మధ్యాహ్నం భోజన కార్మికులు తమ సమస్యలపై ఆందోళన చేసిన సందర్భంలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించకపోగా ఉన్న ఉపాధిని ఊడగొట్టే చర్యలకు పూనుకోవడం విచారకరమని ఆయన అన్నారు. చంద్రబాబునాయుడు చిరు ఉద్యోగులను ఎవరినీ తొలగించే విధానం మాది కాదు అని ప్రకటించినా... క్షేత్ర స్థాయిలో కొందరు టిడిపి నాయకులు చిరుద్యోగులను తొలగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సరైన సమయానికి వేతనం ఇవ్వకపోయినా అప్పులు చేసి పిల్లలకు అన్నం పెట్టారన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ రాహుల్ మీనా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడతానని, తొలగించిన వారికి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జె.నాగరాజు, మిడ్ డే మిల్స్ యూనియన్ నాయకురాలు సుబ్బలక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, బాలనాగమ్మ, కొండమ్మ, తిరుపతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న రఫి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పి.గుడిపాడు డొంక సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పి.గుడిపాడుకి చెందిన చిడిపూడి రాకేష్‌రెడ్డి(19) అనే యువకుడు మృతి చెందాడు. మోటార్ సైకిల్‌పై రాకేష్‌రెడ్డితో పాటు అతని తల్లి శ్రీదేవి, పెద్దమ్మ వెంకటలక్ష్మి స్వగ్రామం నుంచి బండ్లమూడికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా మినీ వ్యాను ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మొదట తీవ్ర గాయాలైన రాకేష్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఒంగోలు హాస్పిటల్‌కు వాహనంలో తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయాలైన శ్రీదేవి, వెంకటలక్ష్మిలు ఒంగోలు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. సంతనూతలపాడు హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఇంటి నుంచి కాలేజీకి వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యమైన ఘటన విశాఖపట్నంలో వెలుగు చూసింది. మార్టూరు అర్బన్ సీఐ ఎస్‌వి రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని తాటివారిపాలెం గ్రామానికి చెందిన గన్నవరం చెన్నకేశవులు కుమారుడు శివశంకర్ వైజాగ్‌లోని రఘు ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతున్నాడు. ఈ ఏడాది సెలవులకని ఇంటికి వచ్చిన శివశంకర్ నెలరోజుల క్రితం కాలేజీలో ఫీజు కట్టాలని రూ.50,000 నగదు తనతో తీసుకొని వైజాగ్ వెళ్లాడు. వారం క్రితం ఫోన్లో మాట్లాడిన శివశంకర్ ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు కాలేజీకి వెళ్లి విచారించారు. నెల రోజుల నుంచి విద్యార్థి కాలేజీకి రావడం లేదని సిబ్బంది చెప్పిన సమాధానం విని నివ్వెరపోయారు. స్థానికంగా విచారించిన కుటుంబ సభ్యులు శివశంకర్ ఆచూకీ లభించకపోవడంతో తిరిగి మార్టూరు చేరుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

సోలార్ పంపుసెట్ల ప్లేట్లు చోరీ

ప్రజాశక్తి-అద్దంకి

పొలాలలో సోలార్ పంపుసెట్ల ప్లేట్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం రాత్రి మండల పరిధిలోని నాగులపాడు గ్రామానికి చెందిన అడుసుమల్లి రమేష్‌బాబు (చిన్న) వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన సోలార్ పంపుసెట్ల ప్లేట్లను ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సోలార్ ప్లేట్లను దొంగిలించారు. రైతు రమేష్‌బాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పొలాల్లో సోలార్ విద్యుత్తు ద్వారా వ్యవసాయం చేస్తున్నామని, రాత్రి తమ పొలాల్లోని 19 సోలార్ పేట్లను ఆటోలో వచ్చి దొంగిలించిన ఆనవాళు ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సోమవారం డీఎస్పీ కిషోర్ బాబు విచారణ చేపట్టారు. కార్యదర్శి హరిబాబు, వార్డు మెంబర్ కనగాల శ్రీనివాసరావులు తనను కులం పేరుతో దూషించారని సర్పంచి దేవరకొండ జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ గ్రామస్తులను విచారించారు. గ్రామస్థులు చెప్పిన వివరాలను నమోదు చేసుకొని వివరాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - కొమరోలు

కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కొమరోలు మండలంలోని చింతలపల్లి గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్టు చేసి, 7 కోళ్లు, రూ.4,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

యుఎంహెచ్ఈయు కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సురేష్, శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వై.సురేష్, కె.శ్రీధర్‌బాబు ఎన్నికయ్యారు. యుఎంహెచ్ ఈయు జిల్లా కమిటీ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు కోశాధికారిగా జి.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అప్పలరాజు, గౌరవాధ్యక్షుడుగా కాలం సుబ్బారావు ఎన్నికయ్యారన్నారు. ఉపాధ్యక్షులుగా బి.కృష్ణ, కె.జయ కుమారి, సహాయ కార్యదర్శిగా ఈ.ధనలక్ష్మి, సి.శారదతో పాటు మొత్తం 18 మంది కార్యవర్గ సభ్యులతో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు.

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

డిఎంహెచ్ఒకు యుఎంహెచ్ఈయు వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మీకోసం సమావేశ మందిరంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాళ్ళూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సచివాలయాలలో పనిచేసే ఏఎన్ఎంలకు యూనిఫారమ్ అలవెన్స్, ఆర్‌సిహెచ్ డేటా ఎంట్రీ అలవెన్స్ ఇవ్వాలన్నారు. వారికి గ్రేడ్ 2 ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు పంపుతాననీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, యూనియన్ జిల్లా నాయకుడు జి.నాగేశ్వరరావు, కె.ఎస్.పల్లి సచివాలయ ఏఎన్ఎంలు కె.తిరుమలమ్మ, ఎస్.కళావతి, జి.లక్ష్మిదేవి, బండ్లమూడి సచివాలయ ఏఎన్ఎంలు టి.శ్రీదేవి, డి.మేరి, ఎం.శ్యామల, కరవది సచివాలయ ఏఎన్ఎం ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ క్రిష్ణారావు మాట్లాడుతూ రెండు నెలలుగా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డంప్ చేసిన ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇసుక కొరత తీర్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య కళాశాల నిర్మాణంపై నివేదిక ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వైద్య కళాశాల నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. వైద్య కళాశాల నిర్మాణంపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. నిజాంపట్నం హార్బర్, వాడరేవు హార్బర్, నిజాంపట్నం సెజ్, చేనేత పార్కు నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. వైద్య కళాశాల ద్వారా బాపట్ల జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు తలమానికగా ఉండేలా రూ.505 కోట్ల నిధులతో వైద్య కళాశాల మంజూరు అయ్యిందన్నారు. నాబార్డ్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నిర్మించేలా ఆమోదముద్ర లభించిందన్నారు. మొదటి దశలో రూ.297 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. అందులో నాబార్డు నుంచి రూ.252 కోట్లు నిధులు మంజూరు కాగా, రూ.45 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. 100 సీట్లతో వైద్య కళాశాల, 450 బెడ్లతో ఆసుపత్రి నిర్మించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 51 ఎకరాలు విస్తీర్ణంలో నిర్మాణ పనులు 15 ఎకరాలలో జరుగుతున్నాయన్నారు. మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఏజెన్సీ చేపట్టిన పనుల్లో 15 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎంఐడిసి ఈఇ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషుకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

గుర్రపుశాల ఎస్సీపాలెంలో నీటి కష్టాలు

200 కుటుంబాలకు ఒకటే బోరు

పొలం బాట పడుతున్న మహిళలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల ఎస్సీ కాలనీలో ప్రజలు తాగునీటి కోసం పొలం బాట పడుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు కూలీ పని వదిలేసి తాగునీటి కోసం పరుగులు పెడుతున్నారు. ఆ కాలనీలో 200 ఎస్సీ కుటుంబాలు ఉండగా ఒక డీప్‌బోరు ఉంది. అయితే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో ఆ డీప్‌బోరులో నీరు సక్రమంగా రావడం లేదు. బిందె నిండడానికి గంట సమయం పడు తోంది. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం మారడంతో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్యాంకర్లను నిలిపివేశారు. టీడీపీ నాయకులే ట్యాంకర్లతో నీరు సరఫరా చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో నీళ్ల తాము తోలాలంటే తాము తోలాలంటూ పోటీలు పడుతున్నారు. ఈ కారణంగా ట్యాంకర్లతో నీటి సరఫరా జాప్యం అవుతోంది. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎస్సీ కాలనీలో నీటి వనరులు లేకపోవడం, ట్యాంకర్లు నిలిపివేయడంతో గత్యంతరం లేక మహిళలు, పిల్లలు, నెత్తిన బిందెలు పెట్టుకొని పొలం బాట పడుతున్నారు. పొలాల్లో త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం ఉన్న సమయంలో పొలం యజమానులను బతిమాలుకొని బిందెలతో నీళ్ల పట్టుకొని కిలోమీటర్ల కొద్దీ దూరం నుంచి నడుచుకుంటూ నీళ్ల తెచ్చుకుంటున్నామని కాలనీవాసులు మరియమ్మ, సలోమి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమస్యను ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోలేదని కాలనీకి చెందిన సుబ్బారావు, నాసరయ్య వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు జోక్యం చేసుకొని ఎస్సీపాలెంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

మృతులకు నివాళి అర్పిస్తున్న మోపిదేవి వెంకటరమణ

మృతుల కుటుంబాలకు మోపిదేవి పరామర్శ

ప్రజాశక్తి-నగరం

కర్లపాలెం మండల పరిధిలో ఆదివారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మండలంలోని పెద్దపల్లి గ్రామపంచాయతీ శివారు గట్టువారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడం తనకు ఎంతో బాధను కలిగించిందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు విచారం వ్యక్తం చేశారు. సోమవారం నగరం మండలం గట్టువారిపాలెం గ్రామంలో మృతుల భౌతిక కాయాలను అయన సందర్శించి నివాళు లర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఎప్పుడు తను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, వైసీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కుష్టు వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-పంగులూరు

కుష్టు వ్యాధి లేని సమాజాన్ని నిర్మించడం కోసం ప్రజలంతా చేయి చేయి కలిపి పని చేయాలని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం ప్రజలకు కుష్టు వ్యాధి పట్ల వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిన వారిపై వివక్ష చూపరాదన్నారు. అవహేళన చేయరాదని, వారి పట్ల ప్రేమాభిమానాలు చూపించాలని కోరారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతులు పాదాలలో నొప్పిలేకుండా పుండ్లు ఉన్నట్లయితే అది కుష్టివ్యాధిగా గుర్తించాలన్నారు. పూర్తిగా కళ్ళు మూసుకోలేకపోవటం, కాళ్ల చేతుల్లో కండరాల బలహీనత ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలని అన్నారు. కుష్టు వ్యాధికి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు పూర్తిగా ఉచితంగా ఇస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు హరిబాబు, మదార్షా, ఏఎన్ఎం మంగమ్మ, సిహెచ్ఓ బిందు, 104 సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశాలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పిఆర్ కమిషనర్‌తో మాట్లాడుతున్న సర్పంచులు

పిఆర్ కమిషనర్‌ను కలిసిన సర్పంచులు

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని తోకలవానిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయించి నూతన బిల్డింగ్ ఏర్పాటుకు సహకరించాలని సర్పంచి కృష్ణమోహన్ కోరారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజను తాడేపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచులందరూ ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు కృష్ణమోహన్ తెలిపారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు కృష్ణమోహన్ అన్నారు. నూతన పంచాయతీ భవన నిర్మాణానికి సహకరించాలని డైరెక్టర్ కృష్ణ తేజను కోరడంతో ఆయన ఉపాధి అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

సిబ్బందిని వేధిస్తున్న వైద్యాధికారి

బాపట్లలో వేటపాలెం పిహెచ్‌సి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో వేటపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలరాజు ఏడాది కాలంగా సిబ్బందిని అనేక రకాలుగా వేధిస్తున్నారని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం గ్రేడ్-2 ఫార్మసిస్ట్ జివిఎన్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ వేటపాలెం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది యేడాది నుంచి వైద్యాధికారి కె బాలరాజు వేధింపులతో ఉద్యోగ విధులు సక్రమంగా నిర్వర్తించలేక అనేక మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మన్నారు. చేష్టలతో క్షేత్రస్థాయిలో ఉద్యోగులు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిబ్బందితో పాటు ఆసుపత్రికి వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చే ప్రజలతో ఆయన తరచూ గొడవలు పడటం నిత్య కృత్యమైంది. రోగులపై, సిబ్బందిపై పలుమార్లు వేటపాలెం పోలీస్

కలెక్టరేట్ వద్ద వేటపాలెం పిహెచ్‌సి వైద్య ఆరోగ్య సిబ్బంది నిరసన

స్టేషన్లో కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. వైద్యాధికారితో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు. విచారణ జరిపి సిబ్బందికి న్యాయం చేస్తామని చెప్పి వెళుతున్నారు తప్ప సమస్య మాత్రం కొనసాగుతూనే ఉంది. వేధింపులకు తాళలేక జిల్లా కార్యాలయం వద్ద సిబ్బంది ధర్నా చేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి వైద్యాధికారితో తాము ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మ దృష్టికి తెచ్చామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఈ ఏడాది మార్చి12న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులను విజయవాడ కార్యాలయంలో కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. అయినా తమకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. ఒక వైద్యాధికారి సమస్యతో వందమంది సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. మానసికంగా ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వర్తించాల్సివస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-నగరం

నగరంలో మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని కొంతమంది అధికారులు ఎందుకు హాజరు కాలేదని ఎంపీడీవోను ఎంపీపీ ప్రశ్నించారు. దీంతో సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు పంపి వారి అభిప్రాయాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని ఎంపీడీవో ఎంపీపీకి తెలియజేశారు. ముందుగా మండలంలోని వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాల ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అందుకు కషి చేయాలని ఎంపీపీ సూచించారు. గ్రామాలలోని ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సర్వసభ సమావేశంలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌మూర్తి, రాధా రమణ, మండలంలోని సర్పంచులు మరియు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నా అవినీతిని నిరూపిస్తే ఉరి వేసుకుంటా

తూనుగుంట్ల సాయిబాబా

ప్రజాశక్తి-భట్టిప్రోలు

తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడైనా తప్పు చేశానని గాని అవినీతికి పాల్ప డ్డానని గాని నిరూపిస్తే భట్టిప్రోలు రథం సెంటర్లో బహిరంగంగా ఉరి వేసుకుంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. వేమూరు నియోజకవర్గ మర్తలూరు మండలం, కూచిపూడి గ్రామం వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి వరి కూటి అశోక్‌బాబు సాయిబాబును ఉద్దేశించి కోడిపందాలు, పేకాట, అక్రమ ఇసుక ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను సాయిబాబా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేమూరి ఎమ్మెల్యే మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు ఉద్దేశించి కూడా పలు విధాలుగా అశోక్ బాబు ఆరోపణలు చేశారని, నిన్న కాక మొన్న వేమూరులో పోటీ చేయడానికి వచ్చిన అశోక్ బాబు నీకు వారి గురించి ఏమి తెలుసు అని సాయిబాబా ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో జగన్మోహన్ రెడ్డి చేసిన అనేక అవినీతి అక్రమాలను ప్రజల గుర్తించి 11 సీట్లకే పరిమితం చేసి ఇంటికి పంపించినప్పటికీ సిగ్గు

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

లేకుండా అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టి హత్య రాజకీయాలు ఢిల్లీ వెళ్లి ధర్నా చేయడం పట్ల రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పై గాని తనపై గాని ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ప్రజలు క్షమిస్తారేమో గాని నేను మాత్రం క్షమించేది లేదని సాయిబాబా వ్యాఖ్యానించారు. ఈ మేరకు అశోక్‌బాబు చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు ఆగస్టు మూడో తేదీన భట్టిప్రోలు రథం సెంటర్లో చర్చా వేదిక ఏర్పాటు చేస్తున్నానని, ఆ వేదికలోకి వచ్చి నాపై ఉన్న ఆరోపణలను నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యడ్ల జయశీలరావు, కంభం సుధీర్, కుక్కల వెంకటేశ్వరరావు, సంసుద్దీన్, వేములపల్లి రాఘవేంద్రరావు, వెంకటేశ్వరరావు, జంగం సాంసన్, వేల్పూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దమ్మన్నవారిపాలెం రహదారి విస్తరించండి

ప్రమాదాలు నివారించండి సర్పంచి గురపసాల వెంకటేశ్వరమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల-కర్లపాలెం జాతీయ ప్రధాన రహదారి మార్గంలో యాజలి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి దమ్మన్నవారిపాలెం ద్వారా ఖాజీపాలెం వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని కర్లపాలెం మండలం దమ్మన్నవారిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచి గురపశాల వెంకటేశ్వరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. దమ్మన్నవారి పాలెం రహదారిని విస్తరించి ప్రమాదాలు నివారించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరుకు వెంకటేశ్వరమ్మ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 216 జాతీయ రహదారి మార్గంలో యాజలి నుంచి వెళ్లే దమ్మున్నవారిపాలెం రహదారి ఇరుకు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ రహదారిని వెడల్పు చేయాలని కోరుతూ పలుమార్లు అర్జీలు సమర్పించినప్పటికీ

రహదారులు భవనాల శాఖ అధికారులు స్పందించలేద న్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. ఇరుకు రహదారికి తోడు ఈ మార్గంలో మలుపుల కారణంగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గతంలో ఖాజీపాలెం, మండేవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గత డిసెంబర్ 31 రాత్రి కర్లపాలెం నుంచి న్యూ ఇయర్ కేక్ తీసుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన స్థలం వద్దే బైక్ చెట్టుకు ఢీకొని ముగ్గురు యువకులు అక్కడికక్కడే మరణించిన సంగతి తెలిసిందే అన్నారు. ఇదే విధంగా చెప్పుకుంటూ పోతే ఈ మార్గంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయినవారు ఎందరో ఉన్నారన్నారు. కేవలం రహదారి వెడల్పు చేయకపోవడం, మలుపులతో ప్రమాదాలు జరగడం నిత్య కృత్యమైంద న్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదాలకు కారణాలను సంబంధిత రహదారులు భవనాల శాఖ గుర్తించకపోవడంతో ఎందరో ఈ మార్గంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ స్పందించి జాతీయ రహదారి నుంచి దమ్మనవారిపాలెం ద్వారా ఖాజీపాలెం వరకు ఈ రహదారి వెడల్పునకు కృషి చేయాలని ఆమె కోరారు.

చెరువులో ఆక్రమణల పరిశీలన

- మంత్రి డాక్టర్ స్వామి ఆదేశాలతో కదిలిన రెవెన్యూ అధికారులు

- ప్రభుత్వ భూమిగా తేల్చిన వైనం

ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన కంచె

చెరువులో.పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ల చెరువు ఆక్రమణలకు గురైనట్లు ఆ గ్రామ రైతులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి డాక్టర్ స్వామి స్పందించారు. కనుమళ్ల చెరువును పరిశీలించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఇన్‌ఛార్జి తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు. ఇరిగేషన్ ఎఇ మధుబాబు మండల సర్వేయర్ బ్రహ్మం, ఆర్ఐ ప్రవీణ్ చెరువును పరిశీలించారు. చెరువులో స్థలంలో చేసిన కంచెను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అధికారుల చెప్పిన వివరాలు ప్రకారం.. 323 సర్వే నబరులో 11 ఎకరాల భూమి చలివేంద్రం ఇనాంగా ఉంది. భూమి గత కొన్ని సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ అవుతుంది. కందుకూరు, ఓగూరు, పలుకూరు ప్రాంతాలకు చెందినవారు ఈ భూమిని కొనుగోలు చేసి గతంలో రిజిస్ట్రేషన్ చేసుకొని లక్షల రూపాయలు చేతులు మారినట్లు నిర్ధారించారు. 2016లో ఈ భూమికి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని కోరుతూ దేవాదాయశాఖ అధికారులు జిల్లా రిజిస్ట్రారుకు లేఖ పంపారు. సుమారు 50 సెంట్లు భూమికి సంబంధించి శింగరాయకొండకు చెందిన కొందరు వ్యక్తులు తమకు హక్కులు ఉన్నాయని చెప్పారు. దీంతో అధికారులు అందుకు సంబంధించిన రికార్డులు చూపాలని కోరారు. ఆ భూమి 323 సర్వే నంబర్‌లో కనుమళ్ల చెరువును ఆనుకొని ఉందని, 11 ఎకరాల చలివేంద్రం ఇనాం భూమి ఉందని రెవెన్యూ. ఇరిగేషన్ శాఖ అధికారులు తేల్చారు. 2011లో రూ. 35 లక్షలకు తాము కొనుగోలు చేశామని ఆరుగురు వ్యక్తులు లబో దిబోదిబో మన్నారు. మరికొందరూ ఎలాంటి కాగితాలు లేకుండానే వచ్చి ఆ భూమి తమదేనంటూ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లా రూపాయల విలువైన భూమి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చొరవతో గ్రామానికి దక్కిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఆ భూమిలోని ఆక్రమణలు తొలగించి గ్రామానికి అప్పగించాలని వారు కోరారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులు మొత్తం పరిశీలించి పూర్తి నివేదిక ఒక వారం రోజుల్లో అందజేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడిఎ బేబిరాణి

పశుగ్రాస విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

పాడి రైతులకు ఉచితంగా సిఎస్ హెచ్ -24 ఎంఎఫ్ రకం పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.బేబిరాణి తెలిపారు. నాగులప్పలపాడులోని పశు వైద్యశాలలో రైతులకు ఉచితంగా సోమవారం పశు గ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు మూడు కేజీలు చొప్పున విత్తలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ ఈ గడ్డి విత్తనాల మేత పశువులకు ఎంతో శ్రేష్టమని తెలిపారు. పాల ఉత్పత్తి పెరిగి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. 75శాతం సబ్సిడీపై పిసి -6 గడ్డి రకం విత్తనాలు కూడ అన్ని పశు వైద్య శాలలో అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు అభివద్ధి కోసం సబ్సిడీపై గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ర్యక్రమంలో నాగులుప్పలపాడు పశవైద్యశాల ఏడీ నాగభూషణం, పశువైద్యులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి త్రిసిఎం గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమ్మె

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆగస్టు 1 నుంచి త్రిసిఎం గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టనున్నట్లు ఫ్యాక్టరీ యజమానులు ప్రకటించారు. మండల పరిధిలోని బూదవాడ రంగసాయి గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద బూదవాడ, మర్రిచెట్లపాలెం, కంభంపాడు, ఒంగోలు,గుండ్లాపల్లిలకు చెందిన త్రిసిఎం గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. ఆగష్టు 1 నుంచి గుండ్లాపల్లి, ఒంగోలు,చీమకుర్తి, ఒంగోలు, బూదవాడ పరిధిలోని త్రిసిఎం ఫ్యాక్టరీల యజమానులు కంటైనర్లు ఎత్తరాదని, అందుకు అందరూ యజమానులు సహకరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -కనిగిరి

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఎన్ఎం ఉమా తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాచవరం యంపియుపి పాఠశాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం మాట్లాడుతూ కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు. సైన్స్ టీచర్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని తాగాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ సంధాని బాషా, ఉపాధ్యాయులు సిద్ధారెడ్డి, రుషేంద్ర, శ్రీను, రామకష్ణ, విజయలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జననీ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అందత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర నేత్రాలయం వారి సహకారంతో ఉచిత మెగా నేత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అందులో మొదటి విడతగా 103 మంది వద్ధులను ఆపరేషన్ల కోసం రెండు ప్రత్యేక వాహనాల్లో గుంటూరు శంకర నేత్రాలయానికి సోమవారం తరలించారు.

మాట్లాడుతున్న పిసి. కేశవరావు

ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులకు

ప్రత్యామ్నాయ మార్గం చూపాలి : సిఐటియు

ప్రజాశక్తి -కనిగిరి : కనిగిరి పట్టణంలోని ప్రధాన వీధులలో ఫుట్ పాత్‌లపై బంకులు తొలగించిన కారణంగా ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని సిఐటియు జిల్లా నాయకుడు పిసి. కేశవరావు డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చట్టాన్ని అమలు చేయాల్సిన మీరే చట్టాన్ని ఉల్లంఘించడం ఏమిటని సిఐటియు నాయకులు ఆర్‌డిఒను ప్రశ్నించారు. వీధి వ్యాపారులకు న్యాయం చేయాలని పట్టు పట్టారు. దీంతో అధికారులు, సిఐటియు నాయకులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వీధి వ్యాపారుల చట్టం ప్రకారం కాకుండా ఉపాధి కోల్పోయేలా బంకులు తొలగించడం సరికాదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులను సర్వే ద్వారా గుర్తించి ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కె. బషీరా, లక్ష్మి ప్రసన్న, నరేంద్ర, ఏడుకొండలు, వీధి వ్యాపారుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్

విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న గఫార్

ప్రజాశక్తి - కనిగిరి

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణంలోని వివిధ ప్రాంతంలో మున్సిపల్ ఛైర్మన్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ విద్యుత్ వోల్టేజీ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న అదనపు ట్రాన్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ పవన్ కుమార్, టిపిఒ వివేకానంద కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న

పెట్రోల్ బంకును ఆపాలని వినతి

ప్రజాశక్తి-మద్దిపాడు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ మండలపరిధిలోని దొడ్డవరం గ్రామస్తులు తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పెట్రోలు బంకు ఏర్పాటు చేస్తున్న స్థలానికి సుమారు కిలోమీటర్ దూరం వరకూ ఇళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు లేవని లేవని విఆర్ఓ నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. అయితే పెట్రోల్ బంకుకు ఎదురుగా హైస్కూల్ ఉందన్నారు. దాని ప్రక్కనే పిఎసి సొసైటీ బిల్డింగ్ ఉందన్నారు. తూర్పు వైపున పొగాకు బ్యారెన్, పశ్చిమాన బ్రేక్స్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాని ప్రక్కనే చర్చి, ఇళ్లు ఉన్నాయని ఫిర్యాదు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులు నివేదికలు ఇచ్చి పెట్రోల్ బంకు ఏర్పాటుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. స్థలం యజమాని పేరున ఎన్‌ఒసి తీసుకున్నట్లు తెలిపారు. అయితే లైసెన్సు ఉన్న వ్యక్తి పేరుతో ఎన్‌ఒసి లేదని తెలిపారు. అన్ని విషయాలు విషయాలు విచారించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడిని మార్చొదని వినతి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ప్రభుత్వ నిబంధనలు మేరకు మండలంలోని కోవిలంపాడు యుపి పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి మార్చరాదని ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్. నాయబ్‌రసూల్ కోరారు. ఈ మేరకు మార్కాపురం ఉపవిద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిలంపాడు పాఠశాలలో పని చేస్తున్న పి.ఏడుకొండలు అనే ఉపాధ్యాయుడు సార్ ప్లస్ కారని తెలిపారు. ఆయనకు ఇంగ్లీషు మెథడాలజీ కూడా లేదని పేర్కొన్నారు. ఈ విషయాలను పరిశీలించి ఏడుకొండలును అదే పాఠశాలలో కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రంలో ఇచ్చిన వారిలో వెంట ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ జి.రామకష్ణ, షేక్ అహ్మద్ ఉన్నారు.

ఘనంగా శుభ దిన్ భోజన్

పలు పాఠశాలల్లో కార్యక్రమం

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (సత్రంబడి)లో శిక్షా సప్తహ 2020 కార్యక్రమంలో భాగంగా శుభ దిన్ భోజన్ సామాజిక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇట్టా రామారావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యా శాఖ అధికారి బూదాటి సుధాకరరావు, 12 వార్డు కౌన్సిలర్ అత్తులూ రమేష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సిరివెళ్ల కాశీలక్ష్మి, పాఠశాల పూర్వ విద్యార్థులు చామర్తి మల్లికార్జున్, మస్తాన్ విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి బూదాటి సుధాకర్ మాట్లాడుతూ సోమవారం పాఠశాలలో ఎన్ఈపి 2020 నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గత వారం రోజులుగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దానిలో భాగంగా శుభ దిన్ సామూహిక భోజన కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమానికి అడిగిన వెంటనే సహకరించిన 12వ వార్డు కౌన్సిలరు రమేష్‌కు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా పాఠశాలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి కౌన్సిలర్ అత్తులూరి రమేష్ కృషి చేయాలని, పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు పూర్వ విద్యార్థులందరూ కృషి చేసి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి సామాజికంగా తమవంతు కృషి చేయాలని అందరినీ కోరారు. అత్తులూరి రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో శుభ దిన్ భోజనాల కార్యక్రమంలో పాల్గొనడం, ఈ కార్యక్రమానికి నా వంతు సహాయ సహకారాలు అందించినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి స్థానిక విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ సహకారంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం వేదవతి, జి కొండమ్మ, జగన్నాథం బాబురావు, ఎం ధనలక్ష్మి, విజయ కుమారి, పి స్వర్ణలత, సి ఆర్పీలు పుణ్యవతి, రమేష్, రామకృష్ణ, శంకరరావు, గురవయ్య, ఐఏ ఆర్టీలు కొంగల శ్రీను, యోనా పాల్గొన్నారు.

పంగులూరు: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పంగులూరు హైస్కూల్లో జరిగిన తిథి భోజనాల పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజువారి జరిగే మధ్యాహ్న భోజనంతో పాటు కొత్త రకాల వంటకాలు కూడా వడ్డించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంగులూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనంతోపాటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కొప్పోలు రమాదేవి పాయసంను, కీర్తిపాటి లక్ష్మయ్య కూరలు, షేక్ షహిన్నా బేగం పెరుగు, ఇతర పదార్థాలను పాఠశాల సిబ్బంది తీసుకువచ్చారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా వీటిని వడ్డించారు. పండుగ వాతావరణంలో తిథి భోజనాలు జరిగాయి. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి భోజనాలు చేశారు. విద్యార్థులు చదువులో కూడా శ్రద్ధ వహించి చదవాలని, మంచి మార్కులతో పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి కోరారు. ప్రభుత్వం చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతో ఉపయోగంగా ఉందని, దాతల సహకారంతో విద్యార్థులకు మంచి భోజనం అందించే అవకాశం ఏర్పడిందని ఆమె అన్నారు.

అద్దంకిలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

పంగులూరులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేదరమెట్ల: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా కోరిసపాడు గ్రామంలో జగ్జీవన్‌రావు నగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో సోమవారం శుభదినం భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా రోజువారీగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన తదుపరి చివరి రోజు అయిన సోమవారం భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎల్ పున్నయ్య, గ్రామ సర్పంచ్ ఈపూరి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి మురళీకృష్ణ, ఉపాధ్యాయురాలు, కొందరు గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: జాతీయ విద్యా విధానం 2020 అమల్లోకి వచ్చి, నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, విద్యా విధానంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన సంస్కరణలను కొనియాడుతూ, దేశవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల, వైస్సార్ నగర్‌లో, జిల్లా స్థాయి వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా ఎపిసి ఉషారాణి పాల్గొని వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. స్థానిక వనరులతో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను వీక్షించి అభినందించారు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సుధీర్‌బాబు, సిఎంఓ పెంచలయ్య, ఎంఇఒ-2, ఆర్ మురళీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ. విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీయుపీ పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో స్వీట్లు సోమవారం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు శీరాం సుబ్బారావు, రావినూతల జయలక్ష్మి విద్యార్థులకు భోజనంలో రెండు రకాల స్వీట్లు వడ్డించారు. కార్యక్రమాన్ని జిల్లా ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ సాగర్ పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కెడివి ప్రసాద్, పి హనుమంతరావు, బి సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇ కరీం

రైతులకు న్యాయమైన విద్యుత్ అందిస్తాం: డిఇ కరీం

ప్రజాశక్తి - అద్దంకి

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు నాణ్యమైన కరెంట్ అందిస్తామని దర్శి డిఈ ఎస్ఏ కరీం తెలిపారు. ముండ్లమూరు ఉప విద్యుత్ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లతోపాటు గ్రామాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లు దరఖాస్తు చేసుకున్న రైతులకు వరుసక్రమంలో అందిస్తామని చెప్పారు. ఈ మధ్యకాలంలో మండల పరిధిలో 50 వరకు పరివర్తకాలు చోరీ జరిగాయని, వాటి స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు రైతులు కూడా పొలాలలో కొత్త వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలని సూచించారు. తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పరిధిలో ఎక్కువ గుర్రైనట్లు గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డీడీలు తీస్తే సరిపోతుందని, మధ్యవర్తులను నమ్మవద్దని, ఎవరికీ డబ్బు ముట్ట చెప్పవద్దని అన్నారు. ఎవరైనా నగదు అడిగినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సిబ్బంది నూరు శాతం విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్నారు. గ్రామాలలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని అన్నారు. అదేవిధంగా తక్కువ ఎత్తు ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈ బ్రహ్మం ఎల్ఐ సాంబయ్య, లైన్‌మాన్‌లు ఆంజనేయులు నాయక్, కోటేశ్వరరావు, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం స్పందన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్ శ్రీనివాసరావుకు వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి మూడు అర్జీలు దాఖలు అయ్యాయి. ఇళ్ల స్థలానికి ఒకటి, అసైన్మెంట్ భూమి క్రమబద్ధీకరణకు మరొకటి, పట్టాదారు పాస్ పుస్తకానికి ఇంకొక దరఖాస్తు వచ్చాయి. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు శీలం శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం శ్రీహరి, ఏపీవో వాసంతి, వెలుగు సిసి లక్ష్మి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొల్లూరు: కొల్లూరు తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిరక్షణ వేదికలో తమ సమస్యలపై తహశీల్దారుకు రిక్షా కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ కొల్లూరు బస్టాండ్ సెంటర్లో గల రిక్షా స్టాండ్ 40 సంవత్సరాలుగా ఉందని అన్నారు. తక్కువ సమయంలో గమ్యస్థానం చేరేందుకు గాను ప్రయాణికులు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. తమకు ఉండేవి చిన్నచిన్న కిరాయిలే అన్నారు. లంక గ్రామాల నుంచి వచ్చే సరుకులు కొల్లూరుకు తోలడం, కొల్లూరులో షాపుల నుంచి బస్టాండ్ లాకు సెంటర్‌కు సరుకులు తోలుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. తమ రిక్షాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, కొంతమందికి రిక్షాలు కూడా లేవని, కాబట్టి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నుంచి చెడిపోయిన రిక్షాలకు రూ.5000, 10 కొత్త రిక్షా బళ్లు ఇప్పించాలని ఎమ్మార్వోను సోమవారం రిక్షా కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో రిక్షా కార్మిక సంఘం కార్యదర్శి కల్లే నాగేశ్వరరావు, కట్ట దుర్గారావు, గొర్రిపూడి మరియదాస్, దేవరకొండ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె

మోటారు వాహనాల సంబంధిత చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్లు ఆర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఓల్డ్ టౌన్ అంకమ్మ చెట్టు వద్ద రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు రేపల్లె మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వలన కలిగే ప్రయోజనాలు, ధరించకపోవడం వల్ల వచ్చే నష్టాలు గురించి వాహనదారులకు వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, ధరించకపోతే నేరము కూడా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్, వాహనదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు గోకులం వర్తింపజేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

తరాలు మారుతున్నా యానాదుల తలరాతలు మారక కాల్వ కట్టలపై కనీస సౌకర్యాలు లేక అనాదిగా జీవనం కొనసాగిస్తున్న నిరుపేద యానాదులకు కనీసం రేషన్ కార్డులు సైతం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిలభారత రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. సోమవారం బాపట్ల మండలంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు యానాదులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అఖిల భారత రైతు సంఘం బాపట్ల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకల ప్రసాద్ మాట్లాడుతూ బాపట్ల మండలం కొండుబొట్ల పాలెం ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న యానాదులకు ఆధార్ కార్డులు రేషన్ కార్డులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పొలాలపై కాలువ కట్టలపై జీవనం సాగించే యానాదుల జీవనోపాధి కోసం ఎస్టీ సామాజిక వర్గానికి సబ్సిడీపై అందజేసే గొర్రెలు, మేకలు, పాడి గేదలను గోకులం పథకం కింద ఎస్టీ కార్పొరేషన్ నిధులతో 90శాతం సబ్సిడీపై అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంటి పని వంటపని కార్మికుల సంఘం నాయకురాలు ఎన్ బీబీజాన్, యానాదుల సంఘం నాయకురాలు పాలెపు వెంకాయమ్మ, కోనేటి సీత, రాపూరి ముసలయ్య, నంబూరి సత్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-పర్చూరు

స్థానిక బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు కోటా శ్రీనివాసరావు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతిని సోమవారం అందజేశారు. కోటా శ్రీనివాసరావు కుమార్తె ఆశాలత ఎంబీబీఎస్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా విద్యార్థులకు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు అందించారు. రోటరీ అధ్యక్షుడు కృష్ణమోహన్ సహకారంతో రూ.10 వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులను కూడా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలను కొనియాడారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, మున్నంగి వెంకటసుబ్బయ్య, పాఠశాల కరస్పాండెంట్ కె రమేష్, కె పార్వతి, హెచ్ఎం అవని పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెవెన్యూ డివిజన్ అధికారి వారి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేదికకు మొత్తం ఐదు అర్జీలు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. నగరం మండలం సజ్జవారిపాలెం చెక్‌పోస్ట్ దగ్గర పంట కాలువ ఆక్రమణకు గురయ్యిందని, సదరు ఆక్రమణలు తొలగించి పంట పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. రేపల్లె మండలం అరవపల్లి గ్రామం నుంచి బోగాతి బసవరాజు తన పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని దరఖాస్తు, రేపల్లె మండలం నల్లూరు నార్త్ గ్రామంలో మోటూరు రంగనాయకమ్మ అనే వృద్ధురాలు తన మనమళ్లకు పొలం తాలూకు సమస్యను పరిష్కరించి అడంగల్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్‌లైన్ చేసి తగు న్యాయం చేయవలసిందిగా దరఖాస్తు, రేపల్లె మున్సిపాలిటీలో దామెర్ల శ్రీనివాసరావు అను వారు తన ఇంటి స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు, నిజాంపట్నం మండలం పల్లపట్ట గ్రామంలో పాముల సతీష్ కుమార్ తన స్థలంలో కొబ్బరి మొక్కలు, మామిడి మొక్కలు పెట్టుకొని సాగు చేసుకుంటున్నానని, వాటిని పక్క రైతులు తీసివేశారని తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ మొత్తం ఐదు అర్జీలు వచ్చాయని రేపల్లె ఆర్డీవో తెలిపారు.

అదనపు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థలో పారిశుధ్య పనులు నిర్వహించిన అదనపు కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా జరిగిది. ధర్నా కార్యక్రమానికి యూనియన్ నగర కార్యదర్శి టి విజయ అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడారు. నగరంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు గాను అధికారులు గత ఏడాది అక్టోబర్‌లో 30 మంది కార్మికులను అదనంగా పనిలోకి తీసుకున్నారని తెలిపారు. రోజువారి కూలీల కింద వారిని పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారు ఈఏడాది జులై ఒకటో తేది వరకు పారిశుధ్య పనులు చేశారని వివరించారు. ఆకార్మికులకు మొదటి మూడు నెలలు మాత్రమే కూలీ చెల్లించారని వివరించారు. మిగిలిన కాలానికి కూలీ అడిగితే అధికారులు ఇవ్వడం లేదన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలలో పనిచేసేందుకే తాము పనిలోకి తీసుకున్నామని, మిగిలిన రోజులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల చేత దాదాపు 10 మాసాలు పని చేయించుకొని, మూడు నెలలు కూలీ ఇచ్చారని, మిగిలిన రోజులకు కూలీ డబ్బులు అడిగితే తమకు సంబంధం లేదని అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే అదనపు కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పటైన రెండు నెలలకే అదనపు కార్మికులను విధుల నుంచి తొలగించడం, వారికి ఇవ్వాల్సిన పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమని చెప్పారు. పెరిగిన జనాభాకు అనుగునంగా పారిశుధ్య కార్మికులు లేనందువల్ల అదనపు కార్మికులను కూడా పారిశుధ్య పనుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో కోవిడ్ కార్మికులుగా గత అనేక సంవత్సరాల నుంచి 150మంది పనిచేస్తున్నారని, వారిని ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చని కారణంగా వారికి ఈఎస్ఐ వర్తించడం లేదని, సెలవులు కూడా వర్తించడం లేదని వివరించారు. కోవిడ్ కార్మికులకు కనీస వేతనం రూ.15వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ హామి ఇచ్చారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె సామ్రాజ్యం, ఆర్ రాములు, కె వెంకటేశ్వర్లు, కె వంశీ, కె పద్మ, బి దివ్య, యాకోబు, ఆమోస్, కె శ్యాము, ఎస్‌కె ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

జాతీయ ఆహార భద్రతపై పార్లమెంట్‌లో 'మాగుంట' ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో జాతీయ ఆహార భద్రతా చట్టంలో ఆహార భద్రతకు ప్రభుత్వ చర్యలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల, ఆహార, ప్రజా పంపిణీ శాఖ సహాయక మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియ సమాధానమిస్తూ దేశంలోని 75 శాతం వరకు గ్రామీణ జనాభాకు, 50 శాతం పట్టణ జనాభాకు అధిక సబ్సిడీపై ఆహారధాన్యాల సరఫరాను జాతీయ ఆహార భద్రతా చట్టం (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ ఆక్ట్) ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మొత్తం జనాభాలో 2/3 మందికి కలుగజేస్తుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 81.35 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని, అందులో 80.54 మందిని మాత్రమే రాష్ట్రాలు గుర్తించాయన్నారు. ఇంకా 0.81 కోట్ల మందిని గుర్తించేందుకు ఈ పథకంలో వీలుందన్నారు. ఈ పథకంలో అర్హత ఉన్న లబ్దిదారులను నిర్ణయించిన పరిమితికి లోబడి ఎప్పటికప్పుడు గుర్తించేందుకు రాష్ట్రాలకు సలహాలు ఇస్తున్నామన్నారు.

అవార్డు అందజేస్తున్న దృశ్యం

సెమీ ఫైనల్స్‌కు 'విఎన్‌జి' విద్యార్థులు..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని డిఆర్ ఆర్‌ఎం మున్సిపల్ స్కూల్ మైదానంలో గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న స్వాతంత్ర దినోత్సవ స్కూల్ లెవెల్ క్రికెట్ అండ్ ఫుట్ బాల్ క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. క్రికెట్ పోటీలలో విఎన్‌జి హైస్కూల్ సంతపేట విద్యార్థులు డిఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ హై స్కూల్ విద్యార్థుల మీద భారీ విజయం సాధించారు. విఎన్‌జి విద్యార్థులు ఫైనల్స్‌కు చేరినట్లు ఆర్గనైజర్ చిక్కాల కిరణ్ కుమార్ తెలియజేశారు. విఎంజి హైస్కూల్ ప్లేయర్ నిఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నారు. ముఖ్యఅతిథిగా ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేపలు పట్టుకునేందుకు లైసెన్సులు మంజూరు చేయండి..

కలెక్టరేట్ వద్ద వైహెచ్‌పిఎస్ ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పామూరు మండలంలోని నుచ్చుపాద ప్రాజెక్టులో చేపలు పట్టుకునేందుకు మత్స్యకారులకు లైసెన్సులు మంజూరు చేయాలని యానాది హక్కుల పరిరక్షణ సమితి అద్యక్షులు పొట్లూరి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. హైకోర్టు కలెక్టర్ ఆదేశాల మేరకు 250 మంది మత్స్యకారులకు చేపలు పట్టుకునేందుకు లైసెన్సులు ఇవ్వాలని కోరుతూ యానాదుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యానాది హక్కుల పరిరక్షణ సమితి నాయకులు చేవూరి కొండయ్య, రాపూరి చంద్రమౌళి, చేవూరి భాస్కరరావు, ఎల్ ఎల్లయ్య పాల్గొన్నారు.

వికలాంగునికి శ్రవణ యంత్రం అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వికలాంగులు సమస్యల పట్ల సంయుక్త కలెక్టర్ స్పందించారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో వికలాంగునికి శ్రవణ యంత్రాన్ని జెసి ఆర్.గోపాలకృష్ణ అందజేశారు. ఒంగోలు నగరానికి చెందిన లక్కవరపు భాస్కర్(15)పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. ఈ సమస్య దైనందిన జీవితానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని మీకోసం కార్యక్రమంలో బాలుని తండ్రి బ్రహ్మానందం జెసి ఆర్ గోపాలకష్ణకు విన్నవించుకున్నారు. కురిచేడు మండలం నాయుడుపాలెం చెందిన మొగిలి కొండలు కుమారుడు మునీంద్ర, తనకు వీల్ చైర్ ఇప్పించాల్సిందిగా మీకోసం కార్యక్రమంలో జెసికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన జెసి ఆర్.గోపాలకృష్ణ దరఖాస్తుదారులకు వెంటనే న్యాయం చేయాల్సిందిగా వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చనను ఆదేశించారు. జెసి ఆదేశాల మేరకు భాస్కర్‌కు శ్రవణ యంత్రాన్ని సమకూర్చారు. ఈ శ్రవణ యంత్రాన్ని జెసి ఆర్ గోపాలకష్ణ భాస్కర్‌కు అందజేశారు. మొగిలి మహేంద్రకు త్వరలో వీల్ చైర్ ఏర్పాటు చేయనున్నట్లు వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రవణ యంత్రం అందజేస్తున్న జెసి గోపాలకృష్ణ

మెరుగైన ప్రతిభ కనబరచాలి

క్రీడాకారులకు జేసీ ఆర్.గోపాలకృష్ణ అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పారిస్ వేదికగా జరుగుచున్న ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రతిభ కనబరచాలని రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులకు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ పిలుపునిచ్చారు. ప్రకాశం భవనం ఆవరణలో సోమవారం సెల్ఫీపాయింట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర క్రీడాకారులు పివి సింధు, ఆర్.సాత్విక్ సాయిరాజు, వై.జ్యోతి, డి.జ్యోతికశ్రీ, బి. ధీరజ్‌లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దేశ క్రీడాకారులకు ప్రజలందరూ అభినందనలు తెలుపుతూ అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివద్ధి అధికారి రాజరాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెల్ఫీ పాయింట్‌లో జేసీ గోపాలకృష్ణ

మోటుపల్లి

చారిత్రక సంపదను కాపాడండి

కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని మోటుపల్లి చారిత్రక సంపదను పరిరక్షించి దాని అభివద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. మోటుపల్లి ఆలయాలు, శాసనాలు శిథిలావస్థలో ఉన్నాయని వీటిని భద్రపరిచి భావి తరాలకు అందించాలని వారు కోరారు. మోటుపల్లి ని పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేసి దాని ఘనతను చాటాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో హెరిటేజ్ సొసైటీ తరపున ఆర్ దశరథరామిరెడ్డి, ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, వేటపాలెం డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, పందిళ్లపల్లి హైస్కూల్ పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి వి.శ్రీమన్నారాయణ ఉన్నారు.

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న సొసైటీ సభ్యులు

రేపల్లెలో అన్న క్యాంటీన్ పనులు ముమ్మరం

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదవాడికి ఐదు రూపాయలకే భోజనాన్ని టిఫిన్ అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను రేపల్లి పట్టణంలో అంబేద్కర్ పార్క్‌లో అధికారులు సిద్ధం చేస్తున్నారు. అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, బయట ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చుట్టూ గ్లాస్ ఫిట్టింగ్ గోడల మరమ్మతులు ఆహారం అందించే విధంగా బలలు ఏర్పాటు చేయడం జరిగింది. ఆగస్టు 15న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అన్న క్యాంటీన్‌కు పూర్వ వైభవం వచ్చే విధంగా అందంగా టిడిపి రంగులతో క్యాంటీన్‌ను ముస్తాబు చేస్తున్నారు. ఆగస్టు 15న ఈ క్యాంటీన్ ప్రారంభమైతే రేపల్లె పట్టణ పరిసర ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందుబాటులోకి వస్తుంది.

గిద్దలూరు హాస్టల్

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

జేసికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హాస్టల్ బాధ్యతలను నిర్లక్ష్యంచడంలో వైఫల్యం చెందిన గిద్దలూరు ఎస్‌సి కళాశాల హాస్టల్ వార్డెన్ రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయ్, సిహెచ్ వినోద్ కోరారు. మీకోసం కార్యక్రమంలో సోమవారం జెసి ఆర్.గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా హాస్టల్లో సర్వేలు చేస్తున్న నేపథ్యంలో గిద్దలూరు పిఆర్ కాలనీ లోని ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శిస్తే పలు సమస్యలను విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ బృందం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ నెల 23 ఉదయం ఇడ్లీ పెట్టాల్సి ఉండగా పులగం మాత్రమే పెట్టారని, మెనూ సక్రమంగా అమలు కాలేదన్నారు. గదులలో విద్యుత్ తీగలు, స్విచ్‌లు తెగి ఉన్నాయని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని మరమ్మతులలో ఉన్నాయన్నారు. గదులలో కిటికీలు, మెస్‌లు మరమ్మతులో ఉన్నాయని, పరిసరాలు శుభ్రంగా లేవన్నారు. వార్డెన్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, విద్యార్థుల బాగోగులను పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారన్నారు. రెండు హాస్టళ్లకు బాధ్యత ఇవ్వడంతో దేనికి న్యాయం చేయడం లేదన్నారు. గతంలోనూ ఈ వార్డెన్ పై పలు ఆరోపణలు ఉన్నాయని, సమీపంలోని హాస్టల్ వార్డెన్‌కు ఇన్‌చార్జి ఇవ్వకుండా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వార్డెన్‌కు హాస్టల్ కేటాయించడంపై ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. స్పందించిన జెసి ఈ విషయాలను స్పందన కార్యక్రమానికి వచ్చిన ఏఎస్‌డబ్ల్యు. లింగయ్యతో చర్చించి జిల్లా అధికారులు వెంటనే హాస్టల్ ను సందర్శించి విషయాలను వెంటనే నివేదిక రూపంలో తెలియజేయాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని జెసి హామీ ఇచ్చారు.

స్థానిక సమస్యలు అక్కడే పరిష్కరించండి..

- మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- అనుమతి లేకుండా సెలవు పెడితే షోకాజ్ నోటీసులు
- అధికారులకు జేసీ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరిక

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక "మీకోసం" కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 253 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. మురుగు కాలువలలో పూడికతీత, ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం వంటి చిన్న సమస్యలను కూడా ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వీటి పరిష్కార తీరును పరిశీలిస్తూ ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజలను తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదని ఆయన తెలిపారు.

అనుమతి లేకుండా సెలవు పెడితే షోకాజ్ నోటీస్

జిల్లా అధికారులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెడితే వారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. మీకోసం కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కాకుండా సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు హాజరు కావటంపై జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవు తీసుకోకూడదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా సెలవు పెట్టిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జెసి డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావును ఆదేశించారు. మీకోసం కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, మాధురి, వరకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో చిల్లచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-తర్లుపాడు

ప్రజాశక్తి కథనానికి స్పందన

స్థానిక పశు వైద్యశాలలో చిల్ల చెట్లను పంచాయతీ అధి కారులు శనివారం తొలగించారు. 'అడవిని తలపిస్తున్న పశువైద్యశాల' శీర్షికన ఇటీవల ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో ప్రచురించిన కథనానికి మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా స్పందించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. తర్లుపాడు పంచాయతీ అధికారులు స్పందించి సోమవారం పశు వైద్యశాల ముందు చిల్ల చెట్లను జెసిబి సాయంతో తొలగించారు.

చిల్లచెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఫిర్యాదుదారుల సమస్యలను

త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల యొక్క ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 58 మంది ఫిర్యాదిదారులు వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఇన్స్పెక్టర్ సిహెచ్.సింగయ్య, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుడి వద్ద ఫిర్యాదు తీసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

ఇసుక అక్రమ రవాణాను

పూర్తిస్థాయిలో అరికట్టాలి..

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆన్ లైన్ ద్వారా మండలస్థాయి అధికారులతోనూ ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపగా, మిగిలిన వాటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలో 7 అర్జీలు, రేపల్లె ఆర్డీఓ పరిధిలో 6 అర్జీలు, చీరాల ఆర్డీవో పరిధిలో రెండు అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై ఆయన ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలని పలు సూచనలు చేశారు.

ఇసుకను ఇష్టానుసారంగా తవ్వుకుని వెళుతుంటే అధికారులు నిర్లిప్తంగా చూస్తూ ఉంటారా.? అని జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలన్నారు. దళారీల అక్రమాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి ఇచ్చే నివేదిక ఆధారంగా సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకానికి మార్గదర్శకాలు విడుదలైన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ తీర్మానాల ఆధారంగా పనులు కేటాయించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయం సిబ్బందితో లబ్ధిదారుల మ్యాపింగ్ చేసి బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి ఇవ్వాలన్నారు. పింఛన్ నగదు పంపిణీ చేసే వరకు ఎంపీడీవోలకు, సదరు సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదన్నారు. జిల్లాస్థాయి అధికారులు సైతం కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. మండల కేంద్రాన్ని విడిచి అధికారులు వెళ్లరాదని సూచించారు. పంద్రాగస్టు వేడుకలలో శకటాలు, స్టాల్స్ ఉండాలని అధికారులకు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్య నభ్యసిస్తూ పదో తరగతిలో 573 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి చేబ్రోలు అరవింద్ ను జిల్లా కలెక్టర్ అభినందించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో ఎంపిక కావడంతో విద్యార్థికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి రవీందర్, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.